# సమస్యల పరిష్కారానికే భూముల రీ సర్వే



నల్లగొండ (బిఎన్ఎస్): భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసమే ప్రభుత్వం భూముల రీ సర్వే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నల్లగొండ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ హాఫీజ్ ఖాన్ అన్నారు .. భూముల రీ సర్వే కార్యక్రమం పై నల్గొండ మండలం, కుదవన్ పూర్ గ్రామంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. భూముల రీ సర్వే వల్ల రైతుల మధ్య ఉన్న గట్ల తగాదాలు, హద్దుల తగాదాల సమస్య లు పోయి భూధార్ కార్డు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. రైతులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# రాపూరులో "ససా"ర్యాలీ




నెల్లూరు జిల్లా రాపూరు (బిఎన్ఎస్):-రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెల మూడో శనివారం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని రాపూరు ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించారు. మండల అభివృద్ధి అధికారిని పీ. వసుంధరమ్మ ఆధ్వర్యంలో ససా కార్యక్రమం జరిగింది. ఎంపీడీవో కార్యాలయం నుండి ర్యాలీ నిర్వహించి మానవహారం ఏర్పాటు చేసి,స్థానిక షాపుల వాళ్ళకి స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం ముఖ్య ఉద్దేశాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో యంపీడిఓ వసుందరమ్మ, కార్యాలయం ఏవో దశరథరామిరెడ్డి, ఇన్చార్జి ఈవోపీఆర్డి బాలకృష్ణారెడ్డి సీనియర్ నాయకులు పీ. చంద్రశేఖర్ పలువురు పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయం సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

# వలసల నివారణకు వి బి జి రాంజీ. పనుల్లో వేగం పెంచండి

## అధికారుల సమావేశంలో కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశం




నల్లగొండ (బిఎన్ఎస్): జిల్లాలో ప్రస్తుత వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని కూలీలందరికీ ఉపాధి కల్పించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఎంపీడీవోలను ఆదేశించారు. ఉపాధి హామీ పథకంతో పాటు వివిధ అభివృద్ధి పనులపై కలెక్టరేట్‌లో అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.... కరువు పరిస్థితుల్లో గ్రామీణ ప్రాంత కూలీలు వలస వెళ్లకుండా పనులు కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు.

విబిజి రాంజీ పథకం కింద భూగర్భ జలాల పెంపునకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. మ్యాజిక్ సోక్ పిట్స్, పర్క్యులేషన్ ట్యాంకులు, ఫార్మ్ పాండ్స్, ఓపెన్ వెల్స్, మ్యాజిక్ డ్రైన్స్ వంటి వాటర్ రీఛార్జ్ నిర్మాణాలను వెంటనే చేపట్టాలని ఆదేశించారు.

# అంతర్రాష్ట్ర దొంగల అరెస్ట్

## 53లక్షల విలువైన సొత్తు స్వాధీనం




నల్లగొండ (బిఎన్ఎస్): రెండు తెలుగు రాష్ట్రాల్లో వరుసగా 40కి పైగా ఇళ్లలో దొంగతనాలు చేస్తూ పోలీసులకు సవాల్‌గా మారిన మోస్ట్ వాంటెడ్ అంతర్‌రాష్ట్ర నేరస్థుడు భూష్మి శ్రీకాంత్ అలియాస్ అమ్మిరాజు తో పాటు అతని గ్యాంగ్ లోని 6గురు సభ్యులను అరెస్టు నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు... నిందితుల నుంచి 53లక్షల విలువ చేసే 258గ్రాముల బంగారం, 5కిలోల వెండి తో పాటు లక్షన్నర నగదు స్వాగీణం చేసుకున్నామని అన్నారు.. నల్లగొండ జిల్లా ఎస్పీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన నిందితులు వారు చేసిన నేరాల గురించి వివరించారు... వీరు తెలంగాణ,లో 28, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లో 12 మొత్తం గా 40 చోరీ కేసులలో నిందితులుగా ఉన్నట్లు తెలిపారు.. వీరి గ్యాంగులో ఉన్న మరోఇద్దరు నిందితుల కోసం గాలిస్తున్నట్లు ఎస్పీ వివరించారు.

# శ్రీవారి కి ప్రత్యేక పూజలు



నెల్లూరు జిల్లా రాపూరు(బిఎన్ఎస్):-ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం అయిన రాపూరు మండలంలోని పెంచలకొన క్షేత్రంలో వెలసియున్న శ్రీ పెనుశీల లక్ష్మీ నరసింహస్వామి ఆదిలక్ష్మి అమ్మవార్ల దేవస్థానం నందు స్వామి వార్ల జన్మ నక్షత్రం సందర్భంగా ఉదయం నాలుగు గంటలకు స్వామి వారికి అభిషేకం, తొమ్మిది గంటలకు శాంతిహోమం, అనంతరం శ్రీవార్లకు నిత్య కళ్యాణ మండపంలో కళ్యాణము, సాయంత్రం శ్రీవార్లకి బంగారు, ప్రధానార్చకులు, వేదపండితులు, గిరిజన వాయిధ్యాలు, మంగళ వాయిద్యాలు నడుమ దేవస్థానం కార్యనిర్వహణాధికారి జనార్దన్ రెడ్డి ఆధ్వర్యంలోఅత్యంత వైభవంగా నిర్వహించి భక్తులకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా క్యూలైన్ ఏర్పాటు, మంచినీరు సరఫరా,అన్నదానం కార్యక్రమం దేవస్థానం ఈ. ఓ.పర్యవేక్షణలో నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థానం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కొనసాగుతున్న రవాణాశాఖ దాడులు -- నిబంధనలు ఉల్లంఘించిన రెండు స్కూల్ ఆటోలు సీజ్



అమలాపురం,(బిఎన్ఎస్) జూలై 18: జిల్లాలో పాఠశాల విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ రవాణాశాఖ అధికారులు ప్రత్యేక తనిఖీలు కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థులను అధిక సంఖ్యలో ఎక్కించుకుని, లగేజీ ప్రదేశంలో కూర్చోబెట్టి ప్రయాణం చేయిస్తున్న రెండు ఆటోరిక్షాలను గుర్తించి కేసులు నమోదు చేసి సీజ్ చేసినట్లు జిల్లా రవాణాధికారి (డీ.టీ.ఓ) దేవిశెట్టి శ్రీనివాసరావు తెలిపారు.

తనిఖీల్లో ఆటోల్లో అనుమతించిన పరిమితికి మించి విద్యార్థులను తీసుకెళ్లడం, భద్రతా నిబంధనలను పూర్తిగా విస్మరించడం వంటి ఉల్లంఘనలు వెలుగుచూశాయని ఆయన పేర్కొన్నారు. విద్యార్థుల ప్రాణాలకు ముప్పు కలిగించే విధంగా వ్యవహరించే వాహనాలపై మోటార్ వాహనాల చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను నిబంధనలు పాటించే వాహనాల్లోనే పంపించాలని, వాహన యజమానులు మరియు డ్రైవర్లు ప్రయాణికుల భద్రతను అత్యంత ప్రాధాన్యంగా తీసుకోవాలని డీటీఓ సూచించారు.

ఈ తనిఖీల్లో మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్లు సురేష్ కుమార్, కౌశిక్ పాల్గొన్నారు. జిల్లాలో రాబోయే రోజుల్లో కూడా ఇలాంటి ప్రత్యేక తనిఖీలు కొనసాగుతాయని రవాణాశాఖ వెల్లడించింది.

# ఎంపేడులో సీసీ రోడ్డు పనులు ప్రారంభం: గ్రామస్తుల దశాబ్దాల కల సాకారం



**బిఎన్ఎస్ న్యూస్ భూపాలపల్లి టేకుమట్ల**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం ఎంపేడు గ్రామంలో గ్రామస్తుల ఎన్నో ఏళ్ల కల ఎట్టకేలకు సాకారమైంది.గ్రామంలోని స్థానిక రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయం నుండి కాదాసీ ఓదెలు ఇంటి వరకు నూతనంగా నిర్మించనున్న సిమెంట్ కాంక్రీట్ (సీసీ) రోడ్డు పనులను సర్పంచ్ హారిక కొబ్బరికాయ కొట్టి అధికారికంగా ప్రారంభించారు. భూపాలపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు (ఎమ్మెల్యే) గండ్ర సత్యనారాయణ రావు సహకారంతో, కోటగిరి సతీష్ గౌడ్ ఆధ్వర్యంలో ఈ రోడ్డు నిర్మాణ పనులు విజయవంతంగా మొదలయ్యాయి.గత కొంతకాలంగా ఈ మార్గంలో సరైన రహదారి సౌకర్యం లేకపోవడంతో గ్రామస్తులతో పాటు ఆలయానికి వచ్చే భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ఎట్టకేలకు కోటగిరి సతీష్ గౌడ్ చొరవతో ఈ సమస్యకు పరిష్కారం లభించి,రోడ్డు పనులు ప్రారంభం కావడం పట్ల గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దశాబ్దాలుగా నలుగుతున్న సమస్యను పరిష్కరించి, గ్రామాభివృద్ధికి సహకరించిన స్థానిక శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావుకు,అలాగే పనులను ముందుకు తీసుకెళ్లిన సతీష్ గౌడ్‌కు ఈ సందర్భంగా గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నేరెళ్ల తిరుపతి గౌడ్, వార్డు సభ్యులు రావుల కిషోర్, బొల్లి పైడి, అలాగే స్థానికులు దేశిని సాయి కిరణ్, శ్రీపతి రవి, నల్లగొని మణికంఠ గౌడ్, నేరెళ్ల వెంకటేష్, నేరెళ్ల రమాకాంత్, ఇసంపల్లి హరితేజ, గ్రామ ప్రజలు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# పోడు భూముల సర్వే హామీ అమలు చేయలేదు


## ఐటీడీఏ పీఓపై న్యూ డెమోక్రసీ విమర్శలు



**బిఎన్ఎస్ న్యూస్ చర్ల, భద్రాద్రి కొత్తగూడెం జూలై 18**


పోడు భూముల సర్వే నిర్వహిస్తామని హామీ ఇచ్చి అమలు చేయకుండా గిరిజన ఆదివాసీ ప్రజలను ఐటీడీఏ పీఓ మోసం చేశారని న్యూ డెమోక్రసీ నాయకుడు ముసలి సతీష్ ఆరోపించారు.సుమారు 30 సంవత్సరాలుగా పోడు భూముల్లో సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న ఆదివాసుల భూముల్లోకి అటవీ శాఖ అధికారులు ప్రవేశించి భూములను స్వాధీనం చేసుకోవడం, కేసులు నమోదు చేయడం, అరెస్టులు చేయడం, దాడులకు పాల్పడడం సరైంది కాదని ఆయన అన్నారు.పోడు భూముల సమస్యపై ఐటీడీఏ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించిన సందర్భంగా పీఓ రెండు రోజుల్లోనే సర్వే చేపడతామని హామీ ఇచ్చారని, అయితే ఆ హామీని నిలబెట్టుకోకుండా సర్వేకు రాకపోవడం గిరిజనులను మోసం చేసినట్టేనని విమర్శించారు.చర్ల, దుమ్ముగూడెం మండలాలతో పాటు ఏజెన్సీ ప్రాంతమంతా అధికారులు మాట మారుస్తూ అటవీ శాఖకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అడవుల్లో జీవనం సాగిస్తున్న ఆదివాసీలకు అండగా నిలవాల్సిన ఐటీడీఏ ఇప్పుడు మొండిచేయి చూపుతోందని అన్నారు.గ్రామసభ తీర్మానాలు, పీసా చట్టాన్ని ఉల్లంఘిస్తూ అటవీ అధికారులు రైతులు సాగు చేసిన పంటలను పీకివేస్తున్నారని, ఇది రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని ముసలి సతీష్ పేర్కొన్నారు.ఏడాది కాలంగా చేతికొచ్చిన పంటలను ధ్వంసం చేస్తున్నప్పటికీ ఐటీడీఏ అధికారులు స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.పోడు భూముల సమస్యపై ప్రభుత్వం వెంటనే స్పందించి సర్వే పూర్తి చేసి గిరిజనుల హక్కులను పరిరక్షించాలని న్యూ డెమోక్రసీ నాయకులు డిమాండ్ చేశారు.

# భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభానికి ముహూర్తం ఫిక్స్



అమరావతి: విజయనగరం జిల్లా భోగాపురం ఎయిర్‌పోర్టు (అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం) ప్రారంభోత్సవానికి ముహూర్తం ఖరారైంది. ప్రధాని నరేంద్ర మోదీ ఆగస్టు 1న ఎయిర్‌పోర్టును ప్రారంభించనున్నట్లు ఏపీ సీఎం చంద్రబాబు తెలిపారు. చరిత్రలో నిలిచిపోయేలా ఈ ప్రారంభోత్సవం జరగాలన్నారు. విమానాశ్రయంపై జరిపిన సమీక్షలో ఆయన మాట్లాడారు. భోగాపురం ఎయిర్‌పోర్టు ఉత్తరాంధ్రకు మణిహారమని.. సరికొత్త అవకాశాలను తీసుకొస్తుందని చెప్పారు. "ఎయిర్‌పోర్టు, టూరిజం ప్రాజెక్టులు, పోర్టులు, హైవేలు, పరిశ్రమలతో ఉత్తరాంధ్ర ఇక అన్‌స్టాపబుల్. రాష్ట్ర సంస్కృతి, వారసత్వం చాటేలా ప్రతి విభాగం ఉండాలి" అని చంద్రబాబు తెలిపారు.

# నేడు స్టేషన్ ఘనపూర్‌లో నాలుగు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపివేత



**బిఎన్ఎస్ న్యూస్ స్టేషన్ ఘనపూర్, జూలై 18**

స్టేషన్ ఘనపూర్ మున్సిపల్ పట్టణ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆదివారం (జూలై 19) ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండనున్నట్లు ఘనపూర్ టౌన్ అసిస్టెంట్ ఇంజినీర్ (ఏఈ) పి. శంకర్ తెలిపారు.నేషనల్ హైవే రోడ్ క్రాసింగ్ వద్ద ఫెయిల్ అయిన అండర్‌గ్రౌండ్ కేబుల్ వైర్‌ను తొలగించి, దాని స్థానంలో టవర్ లైన్ ద్వారా ఓపెన్ లైన్ ఏర్పాటు చేసే పనులు చేపట్టనున్నందున ఈ విద్యుత్ అంతరాయం తప్పనిసరిగా ఉంటుందని ఆయన వెల్లడించారు.ఇటీవల 11 కేవీ మాడల్ కాలనీ ఫీడర్‌పై నేషనల్ హైవే అధికారులు ఏర్పాటు చేసిన రోడ్ క్రాసింగ్ అండర్‌గ్రౌండ్ కేబుల్ కిట్ దెబ్బతినడంతో మాడల్ కాలనీ వినియోగదారులకు ఇబ్బందులు కలగకుండా తాత్కాలికంగా 11 కేవీ మీదికొండ లైన్ ద్వారా విద్యుత్ సరఫరా అందిస్తున్నట్లు తెలిపారు.ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించేందుకు టవర్ లైన్ ఏర్పాటు పనులు చేపడుతున్నట్లు వివరించారు.ఈ పనుల కారణంగా మాడల్ కాలనీ ఫీడర్ పరిధిలోని మాడల్ కాలనీ, బొడ్రాయ్ ఏరియా, ఛాగల్ గ్రామం, ఛాగల్ పంప్ హౌస్ ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని పేర్కొన్నారు.పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని, ఈ సందర్భంగా వినియోగదారులు సహకరించాలని ఘనపూర్ టౌన్ ఏఈ పి. శంకర్ కోరారు.

# సత్తుపల్లి సమస్యల పరిష్కారానికి హైదరాబాద్‌లో అధికారులను కలిసిన ఎమ్మెల్యే"





సత్తుపల్లి/హైదరాబాద్, జూలై 18 (బిఎన్ఎస్)న్యూస్: సత్తుపల్లి నియోజకవర్గంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సమస్యల పరిష్కారంపై శనివారం హైదరాబాద్‌లోని సచివాలయంలో అధికారులతో సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ కలసి చర్చించారు. ఈ సందర్భంగా విద్యాశాఖ ప్రభుత్వ సహాయ కార్యదర్శి ఎస్. శ్రీనివాస్ రెడ్డిని, అలాగే వైద్యం, ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖల మంత్రి కార్యాలయ అధికారులను కలిసి నియోజకవర్గానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. సత్తుపల్లి నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటిని అత్యవసరంగా పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని కోరారు. ప్రజలకు మెరుగైన సేవలు అందేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేసి అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు.

ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి, సత్తుపల్లి నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన చర్యలు త్వరితగతిన చేపట్టాలని సమావేశంలో కోరినట్లు తెలిపారు.

# సీనియర్ న్యాయవాది మెరుగు రవీందర్ కన్నుమూత

## నివాళులు అర్పించిన పలువురు ప్రముఖులు



**బిఎన్ఎస్ న్యూస్ భూపాలపల్లి చిట్యాల**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం చల్లగరిగే గ్రామానికి చెందిన ప్రముఖ సీనియర్ న్యాయవాది మెరుగు రవీందర్ శనివారం అనారోగ్యంతో కన్నుమూశారు. హనుమకొండలోని ఆయన నివాసంలో ఉంచిన రవీందర్ పార్థివ దేహాన్ని రేగొండ బీఆర్ఎస్ మాజీ టౌన్ అధ్యక్షుడు కోలెపాక భిక్షపతి సందర్శించి పూలమాలవేసి నివాళులర్పించారు.రవీందర్ మరణం పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ఆయన, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.పీడిత ప్రజల కోసం పీపుల్స్ వార్ ఉద్యమంలో పనిచేసి జైలు జీవితం గడిపిన రవీందర్.. ఆ తర్వాత సీనియర్ న్యాయవాది ఏ. వెంకటేశ్వర్లు వద్ద 15 ఏళ్ల పాటు న్యాయవాద వృత్తిలో పనిచేశారు.పేదలకు ఎన్నో ఏళ్లుగా ఉచిత న్యాయ సేవలు అందించిన ఆయన,భూపాలపల్లి జిల్లా కోర్టు లీగల్ హెడ్‌గా విధులు నిర్వర్తించి ఇటీవలే ఆ పదవికి రాజీనామా చేశారు.రవీందర్ గారికి ఇద్దరు కుమార్తెలు కాగా,ఒకరు వైద్యురాలిగా (ఎం.డీ), మరొకరు (ఎంఎస్సీ, బీఈడీ పూర్తి చేసి) వ్యాపార రంగంలో స్థిరపడ్డారు.అందరికీ సుపరిచితుడైన రవీందర్ మరణం తీరని లోటని భిక్షపతి ఆవేదన వ్యక్తం చేశారు.ఈ పరామర్శ కార్యక్రమంలో ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కోలెపాక సాంబయ్య, మైస పెద్ద బాలయ్య, మైస సృజన్ తదితరులు పాల్గొన్నారు.

# సరూర్‌నగర్‌లో యువసంగ్రామ సదస్సు.. బీఆర్ఎస్ నేతల గృహనిర్బంధం



హైదరాబాద్,బిఎన్ఎస్ న్యూస్: సరూర్ నగర్‌లో యువ సంగ్రామ సదస్సు నేపథ్యంలో పలువురు భారత రాష్ట్ర సమితి నేతలను పోలీసులు అరెస్టు చేశారు. మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో గృహనిర్బంధం చేశారు. బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను కూడా ఆయన ఇంట్లో నిర్బంధించారు. యువసంగ్రామ సదస్సుకు హైకోర్టు అనుమతి ఉన్నప్పటికీ గృహనిర్బంధం చేయడంపై బీఆర్ఎస్ నేతలు పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం అడుగడుగునా అడ్డుకున్నప్పటికీ నిరుద్యోగ యువత తరఫున తమ గళం వినిపిస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. ప్రభుత్వం నిర్బంధాలు మానుకొని.. ఇచ్చిన హామీల మేరకు రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ నోటిఫికేషన్ వేసిన ఉద్యోగాలకు నియామక పత్రాలు ఇచ్చి.. తామే ఆ ఉద్యోగాలు ఇచ్చినట్టు ప్రచారం చేసుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

